క్లుప్తంగా

ఘనంగా షిర్డీ సాయి ఆలయ వార్షికోత్సవం



పందలపాకలో బాబా ఆలయం వద్ద అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

బిక్కవోలు: పందలపాక గ్రామంలో రావిచెట్టు వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ 23వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బాబావారికి హారతులు ఇచ్చారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు కంచర్ల శ్రీనివాస్, కంచర్ల గణేష్, ముల్లువలస శివ తదితరులు పాల్గొన్నారు.

తాటాకిల్లు దగ్ధం



బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: తంటికొండ గ్రామంలో తాటాకిల్లు దగ్ధమైంది. శనివారం అర్ధరాత్రి వృద్ధుడు నెక్కిన చక్రయ్యకు చెందిన తాటాకింటి నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఆ మంటల్లో చిక్కుకున్న వృద్ధుడు చక్రయ్యను బయటకు తీసుకురావడంతో స్వల్పగాయాలతో బయటపడ్డారు. అగ్ని ప్రమాద బాధితులకు స్థానిక సర్పంచ్ బద్దిరెడ్డి సత్యనారాయణమ్మ, దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి రెడ్డి, వైస్ ఎంపీపీ మడికి మైనర్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు బద్దిరెడ్డి అప్పన్నదొరలు పరామర్శించి నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు సైతం బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు.

కులగణన సర్వేపై అవగాహన

బిక్కవోలు: మండలంలో కులగణన సర్వేపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ ఝాన్సీ తెలిపారు. దీనిపై 6న స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, కుల సంఘాల నాయకులు, విద్యావేత్తలు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ ఉద్యోగులకు అవగాహన కల్పిస్తామన్నారు.

సూర్యదేవుడికి ప్రత్యేక పూజలు



ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు వెంకట నరసింహాచార్యులు

పెదపూడి: జి.మామిడాడలోని ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణమూర్తి స్వామి ఆలయంలో స్వామివారికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వెంకట నరసింహాచార్యులు, మరికొంత మంది అర్చకులు ఉదయం పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

బిక్కవోలు: బలభద్రపురంలో అయ్యప్ప భక్తులు పేటతుళ్లి కార్యక్రమం నిర్వహించారు. గురుస్వామి సబ్బెళ్ల రామారెడ్డి ఆధ్వర్యంలో స్వాములు నృత్యాలు చేస్తూ గ్రామోత్సవం చేశారు. ఈ సందర్భంగా దేవతామూర్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి.

కేంద్ర పథకాలపై ప్రజలకు అవగాహన

కడియం: కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నిర్దేశించిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కడియంలో ఆదివారం నిర్వహించారు. డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రతి గ్రామ పంచాయతీలో ఈ యాత్రను నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.రత్నకుమారి తెలిపారు. ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, తహసీల్దార్ ఎం.సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఆయా శాఖలు అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. ఆయుష్మాన్ భారత్, ఉచిత గ్యాస్ పంపిణీ, భూసార పరీక్షా ఫలితాల కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీజేపీ నాయకులు కురగంటి సతీష్, ఆకుల శ్రీధర్, బొరుసు సుబ్రహ్మణ్యం, కొటికలపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయంపై హర్షం

సీతానగరం: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంపై యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయిల శేషగిరి హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ మరింత పుంజుకుంటుందని చెప్పారు. తెలంగాణ ములుగు నియోజకవర్గంలో కాంగ్రెస్ ఇన్‌చార్జిగా వ్యవహరించానని చెబుతూ, 31 వేల పైబడి మెజార్టీతో సీతక్క ఘన విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు.

రాష్ట్రంలో ఆదర్శవంతమైన పాలన

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- చక్రద్వారబంధంలో గడప గడపకూ మన ప్రభుత్వం



చక్రద్వారబంధంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్ని వర్గాలకు మేలు చేకూరుస్తూ, ఆదర్శవంతమైన పరిపాలనను అందిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని చక్రద్వారబంధంలో ఆదివారం రాత్రి నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అవ్వా, తాతా, అక్కా, చెల్లీ, అమ్మా, అన్నా.. అంటూ ఇంటింటికీ వెళ్లి, ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గడచిన నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. ఇంకా ప్రభుత్వం నుంచి వారు ఏం కోరుకుంటున్నారో అడిగి తెలుసుకునే ప్రయత్నం చేశారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసమే కాకుండా, సర్వ జన సంక్షేమం కోసం దేశంలో ఏ ముఖ్యమంత్రి చేపట్టని అనేక పథకాలను అమలు చేస్తూ, ఏపీని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వంలో ఏ అవసరం వచ్చినా పచ్చచొక్కాలను, జన్మభూమి కమిటీలను ప్రసన్నం చేసుకోవలసి వచ్చేదన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో అర్హత ఉంటే చాలు.. ఆ వ్యక్తి ప్రతిపక్షం వాడైనా సంక్షేమ ఫలాలను అందిస్తున్నారన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి

రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న ప్రభుత్వం తమదేనని జక్కంపూడి రాజా పేర్కొన్నారు. ప్రజానీకానికి ఎప్పుడు, ఏం కావాలో తెలిసున్న నేత జగన్‌మోహన్‌రెడ్డి అని, అందుకనే ఆయన అందిస్తున్న పాలన ఇతర రాష్ట్రాలకూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. సుస్థిర పాలనను అందించే తమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి, పేదరిక నిర్మూలనతో పాటు, రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వాసంశెట్టి పెదవెంకన్న, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, నాయకులు మార్గాని శ్రీను, వాద్రేవు శ్రీనివాస్‌కుమార్, నాగవరపు త్రిమూర్తులు, ఎస్.తాతబ్బాయి, నీలపాల శివరామకృష్ణ, దుర్గారమేష్, గుత్తుల చంద్రరావు, కురుమళ్ల బాబి, యాళ్ల నిరీక్షణరావు, ఎస్ఎస్వీ సత్యనారాయణ, నాగవరపు వెంకటరమణ, భానుశంకర్, పితాని రాంబాబు, కోలాటి వెంకన్న, పి.రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి



పెద్దాడలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పెదపూడి: సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ కోరారు. ఆదివారం పెద్దాడలో గ్రామస్తులకు వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదానికి గురైన సందర్భాల్లో హెల్మెట్ లేకపోవడంతోనే ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. దీంతో సదరు కుటుంబం రోడ్డున పడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ విధిగా ధరించాలన్నారు. యువత దురాలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలై జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు. యువత మంచి ఆశయంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం సైబర్ నేరాల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ప్రతినిధి దిమ్మల రాజుబాబు మాట్లాడుతూ గ్రామాల్లో జిల్లా పోలీసు అధికారులు నిర్వహిస్తున్న వారధిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాసు, ఎస్సై టి.రామకృష్ణ, ఏఎస్సై వి.శ్రీనివాసు పాల్గొన్నారు.

గ్రామాలు ప్రశాంత నిలయాలుగా ఉండాలి

రాజానగరం: నిరంతరం గ్రామాలు ప్రశాంత నిలయాలుగా ఉండాలని, అందుకు అవసరమైన సహాయ, సహకారాలను అందించేందుకు తమ సంస్థ సిద్ధంగా ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి అన్నారు. ఫరిజల్లిపేటలో ఆదివారం రాత్రి జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె మాట్లాడారు. తమ సంస్థ ఈ గ్రామాన్ని గుర్తించిందని, న్యాయపరమైన సమస్యలను, వివాదాలను పరిష్కరించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజల సహకారం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో సీఐ కాశీవిశ్వనాథ్, ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్రత్యూష కుమారి

సీఎం జగన్‌తోనే రాష్ట్ర ప్రగతి



వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

- ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి
- వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు

రంగంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రం ప్రగతి పథాన పయనిస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. బాలవరం గ్రామంలో టీడీపీకి చెందిన చప్పిడి ఉమాగౌరీ, చప్పిడి శ్రీను, పంపన శ్రీను, పితాని దుర్గ, మేడిశెట్టి గంగరాజు, కోలా సుబ్బారావు, బి.లోవగణేష్, మేడిశెట్టి నాగేశ్వరరావు, గుబ్బల వెంకన్న, మేడిశెట్టి నాగరాజు, మేడిశెట్టి గనిరాజు తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలతో అన్నివర్గాలకూ మేలు జరుగుతుందన్నారు. గత టీడీపీ హయాంలో ఒక్క పథకమూ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు ఇప్పుడు కళ్లబొల్లి హామీలు ఇస్తున్నారన్నారు. పథకాలు అమలు కావాలంటే తిరిగి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు, నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులమై వైఎస్సార్ సీపీ చేరామని ప్రకటించారు. అలాగే కోటపాడు గ్రామానికి చెందిన కర్రి శ్రీనివాస్, శ్రీరామశర్మలు టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేశారు. జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇజ్రాయేలు, మండల కన్వీనర్ నల్లా శ్రీనివాసరావు, సర్పంచ్ గవరసాని లక్ష్మీదుర్గ, ఎంపీటీసీ సభ్యుడు సుంకర అప్పారావు, పార్టీ కన్వీనర్ గవరసాని వెంకటరమణ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- ట్రైసైకిళ్లు, స్కూటర్లు, వీల్‌చైర్లు, ఇతర సామగ్రి పంపిణీ



లబ్ధిదారులకు మూడు చక్రాల స్కూటర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా తదితరులు

రాజానగరం: రాష్ట్రంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, వారు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేసేలా వివిధ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా నియోజకవర్గంలోని విభిన్న ప్రతిభావంతులకు హియరింగ్ మెషీన్లు, ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు, మూడు చక్రాల స్కూటర్లను ఆదివారం సాయంత్రం పంపిణీ చేశారు. జక్కంపూడి రామ్మోహనరావు ఫౌండేషన్, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం, రాజమండ్రి రోటరీ రివర్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు సామాజిక పింఛన్లను అందజేయడంతో పాటు, స్వయంసమృద్ధిని సాధించే దిశగా ఉపాధి కల్పనకు అవసరమైన సహకారాన్ని తమ ప్రభుత్వం అందిస్తోందన్నారు. వారి సంరక్షణకు కూడా ప్రత్యేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో నన్నయ వర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు, రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం.సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, జెడ్పీటీసీలు వాసంశెట్టి పెదవెంకన్న, కర్రి నాగేశ్వరరావు, మండల కన్వీనర్ దూలం పెద్ద, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కోలపాటి వెంకన్న, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, నాయకులు మార్గాని శ్రీను, వాద్రేవు శ్రీనివాస్‌కుమార్, డాక్టరు బాబు, నాగవరపు త్రిమూర్తులు, ఎస్.తాతబ్బాయి, నీలపాల శివరామకృష్ణ, దుర్గారమేష్, గుత్తుల చంద్రరావు, కురుమళ్ల బాబి, యాళ్ల నిరీక్షణరావు, ఎస్ఎస్వీ సత్యనారాయణ, నాగవరపు వెంకటరమణ, భానుశంకర్, పితాని రాంబాబు, కోలాటి వెంకన్న, పి.రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలు మార్గదర్శకం

అనపర్తి: స్వామి వివేకానందుని బోధనలు సమాజానికి మార్గదర్శకమని రాజమహేంద్రవరం రామకృష్ణ మఠం ప్రతినిధి స్వామి సేవ్యానందజీ మహరాజ్ అన్నారు. అనపర్తి శ్రీరామకృష్ణ సేవా సమితి, జీబీఆర్ విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో స్వామి వివేకానంద టాలెంట్ టెస్ట్ 2023ను ఆదివారం జీబీఆర్ విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సేవ్యానందజీ మహరాజ్ తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేవండి.. మేల్కొనండి.. గమ్యం చేరేవరకు విశ్రమించకండి అంటూ నిద్రాణమై ఉన్న ఆత్మను మేల్కొలిపి యువశక్తిని జాగృతం చేయడంతో పాటు జాతి పురోగతికి మార్గనిర్దేశం చేసిన వివేకానందుని బోధనలు అనుసరణీయమన్నారు. వివేకానందుని ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రామకృష్ణ మిషన్ సభ్యుడు ఎం.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ 8 మండలాల పరిధిలో 60 పాఠశాలలకు చెందిన సుమారు 1,800 మంది పదో తరగతి విద్యార్థులు ఈ టాలెంట్ టెస్ట్‌కు హాజరైనట్లు చెప్పారు. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన 180 మంది విద్యార్థులను ఎంపిక చేసి ఈ నెల 10న మండల స్థాయిలో పోటీ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు స్వామి వివేకానంద ప్రతిభా పురస్కారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో జీబీఆర్ పీజీ కోర్సుల డైరెక్టర్ బి.రత్నారెడ్డి, జీబీఆర్ పాలకమండలి సభ్యుడు గొలుగూరి రామారెడ్డి, పూర్వపు ప్రిన్సిపాల్ జి.జగన్నాథరెడ్డి, సమితి ఉపాధ్యక్షులు సత్తి వెంకటరెడ్డి, తేతలి సుందరరామారెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, కార్యదర్శులు తాడి చంద్రశేఖర్‌రెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి సత్తిరెడ్డి, జీబీఆర్ డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎస్‌పీ ఆబ్బాయిరెడ్డి, పీఆర్ఎల్ స్వామి పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న సేవ్యానందజీ మహరాజ్

ఓటర్ల నుంచి 2,132 దరఖాస్తులు

రాజానగరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల వద్ద శని, ఆదివారాల్లో నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో 2,132 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ పవన్‌కుమార్ తెలిపారు. మండలంలో కొండగుంటూరు, భూపాలపట్నం, పుణ్యక్షేత్రం, సంపత్‌నగరంలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. ఆయా దరఖాస్తుల్లో ఓటరు నమోదు, సవరణకు ఫారం–6తో 1,261, ఫారం–7తో 147, ఫారం–8తో 724 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిపై వచ్చే అభ్యంతరాలను 26లోగా పరిష్కరించి, జనవరి 5న ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తారని తెలిపారు.

జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్



సూర్యారావుపేట జంక్షన్‌లో రాస్తారోకో చేస్తున్న ప్రజలు

రాజానగరం: మండలంలోని చక్రద్వారబంధం, సూర్యారావుపేట గ్రామస్తులు జాతీయ రహదారిపై సూర్యారావుపేట జంక్షన్ వద్ద ఆదివారం సాయంత్రం రాస్తారోకో చేపట్టారు. దీంతో రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఏటా ఈ జంక్షన్ వద్దనున్న కనకదుర్గ అమ్మవారి తీర్థ మహోత్సవాలు జరిపే ప్రభుత్వం స్థలంలో పెట్రోలు బంకు ఏర్పాటుకు అధికారులు తీసుకున్న నిర్ణయం ఆందోళనకు కారణమైంది. ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా పార్టీలకతీతంగా ప్రజలు ఆందోళనకు దిగారు. సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7 వరకూ ఆందోళన సాగింది. చక్రద్వారబంధంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉన్న స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా విషయం తెలుసుకుని, సంబంధిత అధికారులతో మాట్లాడి, ఆందోళనకారులను శాంతింపజేశారు. స్థలం విషయమై పునఃపరిశీలన చేసి నిర్ణయం తీసుకుంటారని చెప్పడంతో, ఆందోళనను విరమించారు.

ఐక్య గ్రాండ్ క్రిస్మస్‌ను విజయవంతం చేయండి

గోకవరం: గ్రామంలో సోమవారం జరిగే జగ్గంపేట నియోజకవర్గ ఐక్య గ్రాండ్ క్రిస్మస్‌ను విజయవంతం చేయాలని పాస్టర్ ఫెలోషిప్ జిల్లా కార్యదర్శి కన్నబాబు పిలుపునిచ్చారు. ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గోకవరం శివారున లేఅవుట్‌లో నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ ఐక్య క్రిస్మస్‌లో ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్‌ప్రతాప్‌సిన్హా, బిషప్ సజ్జాబర్న బాస్‌తో పాటు పలువురు ముఖ్యఅతిథులుగా పాల్గొంటారన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి క్రైస్తవులు తరలిరావాలని కోరారు. బిషప్ బి.రాజు, రెవరెండ్ విజయ్‌కుమార్, రెవరెండ్ జె.వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల అవధాని డా.రహమతుల్లాకు సన్మానం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఘంటసాల పాటలపై అవధాన ప్రక్రియకు రూపశిల్పి డా.రహమతుల్లా ఆధ్వర్యంలో అవధాన కార్యక్రమం ఆద్యంతం రసవత్తరంగా సాగింది. స్థానిక శ్రీపాద జిత్‌మోహన్‌మిత్ర కళావేదికలో ఆదివారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా శ్రీపాద జిత్‌మోహన్ మిత్ర హాజరుకాగా, పృచ్ఛకులుగా సుమారు 15 మంది అడిగిన వివిధ ప్రశ్నలకు డా.రహమతుల్లా సమాధానాలతో సమ్మోహన పరిచారు. ఏ పాటైనా, ఏ సినిమాలో.. ఎవరు.. ఏ సందర్భంలో ఘంటసాల కలిసి పాడారన్న అనేక విషయాలను తన అద్భుత జ్ఞాపకశక్తితో సమాధానాలిచ్చారు. కార్యక్రమం అనంతరం డా.రహమతుల్లా, శ్రీపాద జిత్‌మోహన్‌మిత్రాను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆనంద్ ఈవెంట్స్ ఆర్గనైజర్ ఆనంద్, కొత్త కనకరత్నమాల, ఏపీ వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ సీనియర్ సిటిజన్ ప్రెసిడెంట్ భీమలాపురం, కవి మహమ్మద్ ఖాదర్‌ఖాన్, గుంటూరు శ్రీనివాసరావు, యూవీ సత్యనారాయణ, డా.బిక్కిన రామమనోహర్, రాయుడు, బోడపాటి సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

కార్తిక వన సమారాధనలతో ఐక్యత

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



జి.మామిడాడలో ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి



పందలపాకలో ఉసిరిచెట్టుకు పూజలు చేస్తున్న మహిళలు



బ్రాహ్మణ సంఘ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి విరాళం అందజేస్తున్న శ్రీరామచంద్రమూర్తి



వనసమారాధనలో మహిళల సందడి

పెదపూడి: కార్తిక వన సమారాధనలతో ఐక్యతా భావం ఏర్పడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం జి.మామిడాడ గ్రామంలో రజక చైతన్య సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, బీజేపీ నియోజకవర్గ కో కన్వీనర్ మురమళ్ల వెంకటరమణ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో పాటు, వెంకటరమణ, వీర వెంకటలక్ష్మి దంపతులు ఉసిరిచెట్టు వద్ద గణపతి, కార్తిక దామోదర పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ కార్తిక వన సమారాధనలను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలన్నారు. ఎమ్మెల్యేకు రజక సంఘం, పార్టీ నాయకులు పెద్దఎత్తున స్వాగతం పలికారు. వైస్ ఎంపీపీ ద్వారంపూడి పద్మారెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకట పద్మావతి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మండ రాజారెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మేడపాటి హరినారాయణరెడ్డి, ద్వారంపూడి ప్రభాకర్‌రెడ్డి, రజక చైతన్య సంఘ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

పందలపాకలో..

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని శ్రీకట్లమ్మ తల్లి ఆలయం వద్ద కార్తిక వన సమారాధన నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టు వద్ద పూజలు జరిపారు. మధ్యాహ్నం కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం చిన్నారులు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. అలాగే వినాయక నగర్‌లో కార్తిక వన సమారాధన జరిగింది.

కార్తిక అన్న సమారాధన

సీతానగరం: కార్తిక మాసం సందర్భంగా సీతానగరంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వద్ద ఆదివారం అన్న సమారాధన ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికుల సహకారంతో ఇందుకూరి వెంకట రామప్రసాద్, ఇందుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో అన్న సమారాధన నిర్వహించారు. సుమారు నాలుగు వేల మంది భక్తులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు రోడ్డులో సందడే సందడి

మధురపూడి: రాజమహేంద్రవరం విమానాశ్రయం రోడ్డులో ఆదివారం వన సమారాధనల సందడి నెలకొంది. కార్తిక మాసం కావడంతో తోటలన్నీ పర్యాటకులతో నిండిపోయాయి. వన సమారాధనల కారణంగా తోటల్లో రద్దీ ఏర్పడింది. పిల్లల కేరింతలు, ఆటపాటలతో సందడి నెలకొంది. రాజమహేంద్రవరానికి చెందిన వివిధ సంఘాలు వన సమారాధనలు నిర్వహించాయి. స్థానిక పుల్లయ్య మామిడితోటలో శిష్టకరణ సేవా సమితి ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. ప్రత్యేక పూజలతో పాటు సంఘ జనరల్‌బాడీ సమావేశం నిర్వహించారు. గాడాల అభయ పొన్నారి వెంచర్స్‌లో యూటీఎఫ్ ఆధ్వర్యంలో వన సమారాధన జరిగింది. బూరుగుపూడి రత్నా ప్లాస్టిక్ తోటలో లక్ష్మీ నరసింహ గాయత్రి బ్రహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో రాజానగరం నియోజకవర్గం స్థాయి వన సమారాధన నిర్వహించారు.

విశ్వబ్రాహ్మణ సంఘం కార్తిక వనసమారాధన

గోకవరం: స్థానిక మండల విశ్వబ్రాహ్మణ సంఘం కార్తిక వనసమారాధన ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామ శివారున గంగాలమ్మ ఆలయం సమీపంలోని పామాయిల్ తోటలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో తొలుత కేదారేశ్వర పూజ నిర్వహించారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా సంఘ సభ్యులు ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి భారీ సంఖ్యలో సంఘం సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అనపర్తిలో..

అనపర్తి: కార్తిక మాసం.. ఆపై ఆదివారం సెలవు దినం కావడంతో అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో వన సమారాధనల సందడి నెలకొంది. పలు ప్రాంతాల్లో కుల సంఘాలు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, బంధువుల ఆధ్వర్యంలో వన సమారాధనలు నిర్వహించుకున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని వనాలు కోలాహలంగా మారాయి. అనపర్తి జీబీఆర్ కళాశాల ఎదురుగా మామిడి తోటలో స్థానిక గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు దంతుర్తి ప్రసాద్ మాట్లాడుతూ భగవత్ ఆరాధనతో సమానంగా ప్రకృతిని ఆరాధించే సనాతన ధర్మం భారతీయ హైందవ ధర్మమన్నారు. చిన్నా, పెద్దా తారతమ్యం లేకుండా ఆట పాటలతో ఆనందంగా గడిపారు. ముందుగా వేదపండితుల ఆధ్వర్యంలో కార్తిక దామోదరునికి ఉసిరిచెట్టు వద్ద పూజలు చేశారు. ఇదిలా ఉండగా సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న గాయత్రీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాలుకు గ్రామానికి చెందిన వాడపర్తి శ్రీరామచంద్రమూర్తి రూ.లక్ష విరాళాన్ని కమిటీ ప్రతినిధులకు అందజేశారు. అనపర్తి సంఘ ప్రతినిధులు మారెళ్ల గంగరాజుశర్మ, గరికపాటి సూర్యనారాయణ మూర్తి, చాగంటి సుబ్రహ్మణ్యం, పీవీఎస్ సూర్యనారాయణ, నాగదేవర సూరిబాబు బ్రదర్స్, రెడ్డి సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.